
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com
5-8-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

## వర్షం వస్తే భయమే..



2




2

## ఆస్పత్రి డ్రైనేజీలో నవజాత శిశువు మృతదేహం

## స్వయంగా రోడ్డు పనులు పూర్తి చేసిన గ్రామస్తులు



**అక్షరటుడే, కోటగిరి:** వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పోతంగల్ మండలం కొల్లూర్ వాగు ఉప్పొంగి ప్రవహించడంతో, తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోవడంతో కొల్లూరు గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు.బుధవారం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్డుకు మరమ్మతులు చేయించారు. పైప్‌లైన్ పైనుంచి వాహనాలు, ప్రజలు వెళ్లేలా మొరం పోసి దారిని పునరుద్ధరించారు. వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

# రోడ్డెక్కితే నరకం..

**నాలుగైదు రోజులుగా కామారెడ్డి పట్టణంలో కురుస్తున్న వర్షా లకు రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. ఇప్పటికే అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లపై వర్షపు నీరు చేరి తారు లేచిపోయింది. ఫలితంగా చిన్నచిన్న గుంతలు కూడా పెద్దవిగా మారాయి. ప్రతి కూడలి, ప్రతి వీధిలో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇవి రోడ్లేనా అంటూ పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి**



**■ పట్టణంలో గుంతలమయంగా మారిన రోడ్లు ■ ప్రమాదకరంగా ప్రధాన రహదారులు ■ పట్టించుకోని అధికారులు ■ ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు ■ మరమ్మతులు చేయాలని డిమాండ్**

పట్టణంలో 49వార్డులు ఉన్నాయి. సుమారు లక్షకు పైగా వరకు జనాభా ఉంది. ఎక్కడ చూసినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. ప్రత్యేకంగా ఏదో ఒక ప్రాంతం అని చెప్పలేని పరిస్థితి. ఉదయం ఆఫీసులు, స్కూళ్లకు వెళ్లే సమయంలో రద్దీ ఎక్కువగా ఉండడంతో గుంతలను తప్పించుకుంటూ వాహనదారులు దూసుకుపోతున్నారు. ఈ క్రమంలో కిందపడి గాయాలపాలవడం, ఆటోలు, కార్ల సస్పెన్షన్ దెబ్బతింటున్నాయి. రాత్రి వేళల్లో సరైన వెలుతురు లేకపోవడంతో ప్రమాదాల తీవ్రత మరింత పెరిగింది.





### కలెక్టరేట్ రోడ్డులో..

పట్టణంలోని కీలకమైన రోడ్లన్నీ ప్రమాదకరంగా మారాయి. ప్రజలు రోజూ వినియోగించే మార్గాల్లోనే అత్యధిక గుంతలు ఉన్నాయి. కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు, ఉద్యోగులు ఎక్కువగా వినియోగించే ఈ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. పాత బస్టాండ్ నుంచి పంచముఖి హనుమాన్ ఆలయం రోడ్డు గుండా కలెక్టరేట్ మార్గాన్ని భక్తులు, వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కువగా వాడతారు. న్నారు.

### డెయిలీ మార్కెట్ చుట్టూ..

ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా ఉండే డెయిలీ మార్కెట్ చుట్టూ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. గుంతల కారణంగా కూరగాయలు, ఇతర సరుకులతో వచ్చే వాహనాలు చెడిపోతున్నాయి. ఇతర మండలాలు, జిల్లాలను కలిపే సిరిసిల్ల రోడ్డు, దేవునిపల్లి రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణం నరక ప్రాయంగా మారింది. నిజాంసాగర్ చౌరస్తాలోని మూల మలుపు, బేకరీ సమీపంలో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఇవే కాకుండా విద్యానగర్, ఎన్జీవోస్ కాలనీతో పాటు పట్టణంలోని చాలా కాలనీ రోడ్లు కూడా ఇదే పరిస్థితిలో ఉన్నాయి.

### రోడ్ల పరిస్థితులపై ప్రజల ఆవేదన..

రోడ్ల దుస్థితిపై పలుమార్లు మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖలకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. పన్నులు సక్రమంగా వసూలు చేస్తున్నారు. కానీ కనీసం రోడ్లు బాగు చేయడం లేదు. ఎవరైనా ప్రాణాలు కోల్పోయిన తర్వాతనైనా స్పందిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల నిర్లక్ష్యం

పట్టణంలోని అంతర్గత రోడ్లన్నీ మున్సిపల్ పరిధిలో ఉండగా, సిరిసిల్ల రోడ్డు, దేవునిపల్లి రోడ్డు వంటి ప్రధాన రహదారులు ఆర్అండ్‌బీ ఆధీనంలో ఉన్నాయి. కానీ రెండు శాఖల అధికారులు కూడా బాధ్యత మరిచి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాలు ప్రారంభమైనప్పటి నుంచి ఒక్కసారి కూడా గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకోలేదు. రోడ్లపై హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ప్రమాదాలు జరిగినా స్పందించని తీరుపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### మరమ్మతులు ఉంటాయా..?

మరో రెండు వారాల్లో వినాయక చవితి పండుగ వస్తోంది. పండుగ సందర్భంగా పట్టణంలో భక్తుల రద్దీ, ఊరేగింపులు, బజార్లలో రాకపోకలు విపరీతంగా పెరుగుతాయి. ఇప్పటికే గుంతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు, పండుగ సమయంలో పరిస్థితి మరింత దిగజారుతుందని ఆందోళన చెందుతున్నారు. కనీసం ప్రధాన రోడ్లపైనా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. గుంతలను వెంటనే పూడ్చకపోతే పెద్ద ప్రమాదాలు తప్పవని, అందుకు బాధ్యత మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులదే అవుతుందని పేర్కొన్నారు. రహదారుల పరిస్థితులపై ఆర్ అండ్ బీ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

### రూ.40 లక్షలు మంజూరయ్యాయి



పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. వీటి మరమ్మతుల నిధుల కోసం కలెక్టర్‌ను కోరగా ఎస్డీఆర్ఎఫ్ ఫండ్స్ నుంచి రూ.40లక్షలు మంజూరు ఇచ్చారు. ఈ నిధులను వార్డుల వారీగా కేటాయించాం. అయితే పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ కావాల్సి ఉంది. రెండుమూడు రోజుల్లో టెండర్ పూర్తి చేసి పనులు మొదలు పెడతాం.

**– పర్వతాలు, మున్సిపల్ కమిషనర్**

## బోనాలు సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయి : పీసీసీ చీఫ్



**అక్షరటుడే, ఇందూరు:** బోనాలు సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. టీఎన్జీవోస్ నిజామాబాద్ ఆధ్వర్యంలో నగరంలోని పాత కలెక్టరేట్ వద్ద నవదుర్గా ఆలయంలో బోనాల ఉత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి ఆయన బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు మహేష్ కుమార్ గౌడ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, మేయర్ ఉమారాణి, మాజీ మేయర్ సంజయ్ తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఛైర్మన్లు కేశ వేణు, శేఖర్ గౌడ్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, రామకృష్ణ, దయాకర్ గౌడ్, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, టీఎన్జీవోస్ నిజామాబాద్ అధ్యక్షుడు సుమన్‌కుమార్, కార్యదర్శియ నేతికుంట శేఖర్, ప్రతినిధులు పెద్దోళ్ల గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, టీఎన్జీవోస్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## బోధన్ శ్మశాన వాటిక నిధుల రగడపై 'లోకాయుక్త' విచారణ



**అక్షరటుడే, బోధన్:** బోధన్ మున్సిపాలిటీ 16వ వార్డు ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధి నిధుల దుర్వినియోగంపై కొన్నాళ్లుగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో బుధవారం 'లోకాయుక్త' సభ్యులు బోధన్ పట్టణాన్ని సందర్శించారు. లోకాయుక్త కమిషనర్ జైపాల్, అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. 2018లో ప్రహరీ నిర్మాణంలో రూ.7.80 లక్షలు, 2023లో 'పట్టణ ప్రగతి' కింద టాయిలెట్ల కోసం కేటాయించిన రూ.4.43 లక్షలు పనులు చేయకుండానే మున్సిపల్ నిధులు కాజేశారని మాజీ కౌన్సిలర్ టి.రాజవిఠల్ లోకాయుక్తను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదుపై లోకాయుక్త క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. గతంలో మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ కూడా ఇదే అంశంపై విచారణ చేపట్టారు. లోకాయుక్త కమిషనర్‌తో పాటు బోధన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తూము పద్మ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## రూరల్‌ను కాంగ్రెస్ కంచుకోటగా తీర్చిదిద్దుదాం




**అక్షరటుడే, డిచ్‌పల్లి:** నిజామాబాద్ రూరల్‌ను కాంగ్రెస్‌కు శాశ్వత కంచుకోటగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే డా. భూపతిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఇందల్వాయి మండల అధ్యక్షుడు చింతల కిషన్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా ఎన్నికైన మండల కమిటీని అభినందించారు. పార్టీ బలోపేతం, రాష్ట్ర రాజకీయాలు, కేంద్ర ప్రభుత్వ వైఖరి, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ఎమ్మెల్యే సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా చైతన్యవంతమైన ఇందల్వాయి మండలంలో గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, కష్టానికి తగిన గుర్తింపు, సముచిత స్థానం కల్పించడం కాంగ్రెస్ పార్టీ విధానమని స్పష్టం చేశారు. సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి, కర్నా మోహన్ అకాల మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఏఎంసీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, సాయరెడ్డి, పొలసాని శ్రీనివాస్, నవీన్ గౌడ్, బాల్ రాజు, వెంకట్ పాల్గొన్నారు.

## నగర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం




**అక్షరటుడే, ఇందూరు:** నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా తన ప్రతి అడుగు ఉంటుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడిచినా.. నియోజకవర్గ అభివృద్ధి కోసం నయాపైసా ఇవ్వడం లేదన్నారు. నగర మేయర్, కార్పొరేషన్ కమిషనర్ నగరంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. నిధుల కోసం అనేక సార్లు ఆయా శాఖల మంత్రులను కలిశానని గుర్తు చేశారు. ప్రధానంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి పలు అంశాలపై వినతి అందజేశానన్నారు. ఇందూరులోని టీ హబ్ ద్వారా యువతకు ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీలు తీసుకురావాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కలిసినట్లు చెప్పారు. జిల్లా జనరల్ ఆస్పత్రి సమస్యలను సమగ్రంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వివరించినట్లు తెలిపారు. ఎమ్మారై యంత్రం ఇప్పటికీ లేకపోవడం, ఫ్రీజర్ల కొరత, లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ లేకపోవడంపై వివరించానన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** సాంకేతికత పెరిగే కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, వీటిని నివారించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో చేపట్టిన సురక్షా తిరంగా సైబర్ స్వతంత్ర తెలంగాణ ప్రచారాన్ని బుధవారం భిక్కనూర్ పట్టణంలో ఎస్పీ ప్రారంభించారు. స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు, నకిలీ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏఐ వాడకంతో డీప్‌ఫేక్ వీడియోలు, నకిలీ వాయిస్ కాల్స్ కూడా పెరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు, యువత పార్ట్ టైమ్ జాబ్‌లు, పెట్టుబడుల ఆఫర్లు, అపరిచిత క్యూఆర్ కోడ్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 కు ఫోన్ చేయాలని సూచించారు. ఆగస్టు నెలంతా జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మధుసూదన్, సీఐ నరేష్, ఎస్ఐ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర ఘరానా దొంగల ముఠా




**అక్షరటుడే, కామారెడ్డి:** దోపిడీ కేసుల్లో పాల్గొంటున్న ఐదుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను కామారెడ్డి టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర బుధవారం వివరాలు వెల్లడించారు. కామారెడ్డి రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వేలిముద్రలను పరిశీలించగా వారి గత నేరచరిత్ర వెలుగులోకి వచ్చింది. వారి వద్ద నుంచి రూ.4 వేల నగదు, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పట్టణంలోని జయశంకర్ కాలనీకి చెందిన అజ్జున్ నిరేష్ ఇంటి తాళం పగులగొట్టి రూ.2 వేల నగదు చోరీకి సంబంధించి కేసు నమోదైన వెంటనే దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. గత నెల 27న మహారాష్ట్ర నుంచి కామారెడ్డికి వచ్చిన నిందితులు మరుసటి రోజు ఎస్‌బీఐ ఇందిరానగర్ శాఖలో బ్యాంకు నుంచి డబ్బు తీసిన వ్యక్తి వద్ద డబ్బులు లెక్కించి ఇస్తామని రూ.15 వేలు కొల్లగొట్టారు. ఈనెల 3న నిజామాబాద్‌లో కత్తులతో బెదిరించి నగదు దోచుకున్నారు. 4న కామారెడ్డిలో ఇంట్లో చోరీ చేశారు. మహారాష్ట్ర నాగపూర్ జిల్లా కాంప్టీకి చెందిన మహమ్మద్ అలీ రజాక్, మహమ్మద్ నాసిర్, మహమ్మద్ సాదిక్, మహమ్మద్ షాహిద్ రజాక్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎస్.కె. ఫైజాన్‌గా గుర్తించారు. వీరిపై కామారెడ్డి టౌన్, నిజామాబాద్‌తో పాటు మహారాష్ట్ర బల్లార్షా, చంద్రపూర్‌లోనూ కేసులు ఉన్నాయి. వీరిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

## సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం :** సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నగరంలోని విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. నేటి డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో.. అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా స్టాక్ ట్రేడింగ్,పెట్టుబడుల మోసాలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. మోసగాళ్లు '100శాతం గ్యారంటీ రిటర్న్స్', 'డైలీ ప్రాఫిట్', 'ఇన్‌సైడర్ టిప్స్' వంటి తప్పుడు హామీలతో ప్రజలను ఆకర్షిస్తున్నారని తెలిపారు. నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, నకిలీ వెబ్‌సైట్లు, వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా ప్రారంభంలో నకిలీ లాభాలను చూపించి అనంతరం మరింత పెట్టుబడి పెట్టేలా ప్రలోభపెట్టి చివరకు డబ్బు మొత్తం లాగేస్తారని హెచ్చరించారు. పోలీస్ శాఖ ప్రజల భద్రతకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉందన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, సంబంధిత శాఖలతో సమన్వయంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. అనంతరం సైబర్ అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్, నిజామాబాద్ రూరల్ (నార్త్) సీఐ శ్రీనివాస్, సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ముఖీద్ పాషా, మాక్లూర్ ఎస్సై అనిల్ కుమార్, సైబర్ క్రైం ఎస్సైలు రవికుమార్, ప్రవళిక, సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద.. 36 టీఎంసీలకు చేరిన నీటినిల్వ



**అక్షరటుడే, మెండోరా:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు నుంచి వస్తున్న వరదతో మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ (పోచంపాడ్) ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. బుధవారం ఉదయం 9 గంటల వరకు ప్రాజెక్టులోకి 33,208 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు అధికారులు తెలిపారు. విష్ణుపురి, బాలేగావ్ ప్రాజెక్టులు దాదాపు 99 శాతం నిండిన నేపథ్యంలో శ్రీరాంసాగర్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,091 అడుగులు, పూర్తి నిల్వ సామర్థ్యం 80.50 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1,076.50 అడుగుల వద్ద 36.27 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 423 క్యూసెక్కులు కలిపి మొత్తం 954 క్యూసెక్కుల నీరు పోతుంది.



## లక్ష్మీ కాలువకు నీరు విడుదల చేయాలి


**అక్షరటుడే, మెండోరా:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతుల ప్రయోజనాల దృష్ట్యా లక్ష్మీ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రాజెక్ట్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కు నర్సయ్య మాట్లాడుతూ, ఆయకట్టు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే లక్ష్మీ కాలువకు నీటి విడుదల చేయాలని కోరారు. 48 గంటల్లో నీటిని విడుదల చేయకపోతే ఆయకట్టు రైతులతో కలిసి ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముప్కల్ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్, సీనియర్ నాయకులు ముస్కు భూమేశ్వర్, చిల్క దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం



**అక్షరటుడే,ఆర్మూర్ :** సమయానికి స్పందించి ప్రాణాలు కాపాడడంలో 108 సిబ్బంది మరోసారి మానవత్వం చాటుకున్నారు. అంబులెన్స్‌లోనే గర్భిణికి సురక్షితంగా ప్రసవం చేయించి తల్లి, బిడ్డ ఇద్దరినీ కాపాడారు. జక్రాన్‌పల్లి మండలం, కలిగోట్ గ్రామానికి చెందిన కమ్మరి సోని అనే గర్భిణికి బుధవారం అకస్మాత్తుగా పురుటినొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే ఈఎంటీ రాథోడ్ జగదీష్, పైలట్ నరేందర్‌లు క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని ఆర్మూర్ ఏరియా ఆస్పత్రికి తరలించేందుకు యత్నించారు. అయితే మార్గ మధ్యంలో నొప్పులు మరింత తీవ్రమయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో సిబ్బంది ఆలస్యం చేయకుండా అంబులెన్స్‌లోనే ఆమెకు సురక్షితంగా ప్రసవం జరిపారు. సకాలంలో ప్రసవం జరగడంతో తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని ఆర్మూర్ ఆస్పత్రిలో చేర్పించారు.

# వర్షం వస్తే భయమే..



భారీ వర్షం కురిసిందంటే చాలు.. సుమారు మూడు కాలనీల వరద నీరంతా హౌసింగ్‌బోర్డు కాలనీలోకే చేరుతుంది. కల్వర్టు చిన్నదిగా ఉండటంతో వరద ప్రవాహం పెరిగి, నీరు పక్కనే ఉన్న ఇళ్లలోకి చేరుతోంది. గత పదేళ్లుగా ఆర్మూర్ హౌసింగ్ బోర్డ్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న దుస్థితి ఇది.

– అక్షరటుడే, ఆర్మూర్

■ ఆర్మూర్ పట్టణంలో పరిస్థితి ■ కల్వర్టు నిర్మాణానికి మోక్షమెప్పుడో?
■ నిధుల కేటాయింపు, టెండర్లు పూర్తి ■ పనుల ప్రారంభం కోసం కాలనీవాసుల నిరీక్షణ

పదేళ్ల క్రితం 3వ వార్డులో మహాలక్ష్మి కాలనీ నుండి హౌసింగ్ బోర్డ్ కాలనీని కలుపుతూ భారీఎత్తున బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ కాలనీలో రెండువేల వరకు జనాభా ఉంది. అయితే, ఆ రోడ్డు కింద తగిన స్థాయిలో పెద్ద కల్వర్టును ఏర్పాటు చేయకపోవడంతో, వర్షాలు కురిసిన ప్రతిసారీ వరద నీరు సమీపంలో ఇళ్లను ముంచెత్తుతోంది. సమస్య పరిష్కారం కోసం కాలనీవాసులు పాలకులు, ప్రతిపక్ష నాయకులతో పాటు మున్సిపల్ అధికారుల చుట్టూ తిరుగుతూ వినతిపత్రాలు అందజేశారు. ఎట్టకేలకు స్పందించిన మున్సిపల్ అధికారులు, భారీ కల్వర్టు ఏర్పాటుకు నిధులు విడుదల చేయడమే కాకుండా టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు.

### టెండర్లు పూర్తయినా..

టెండర్లు పూర్తయి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంపై కాలనీవాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో మళ్లీ ఎక్కడ వరద నీరు ఇళ్లలోకి చేరుతుందోనని ఆందోళన చెందుతున్నారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలోని పిప్రి మాజీ సర్పంచ్ కిరణ్ కుమార్ ఇంటి ముందు నుండి డాక్టర్ రుద్ర శ్రీనివాస్ ఇంటిని కలుపుతూ, బీటీ రోడ్డు కింద నుంచి భారీ కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. కానీ నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడంతో వర్షాకాలంలో కాలనీవాసులు భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు.



### కల్వర్టు నిర్మాణం చేపట్టాలి..



భారీ వర్షాలు కురిసినప్పుడల్లా వరద నీరు హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఇళ్లలోకి చేరుతుంది. కల్వర్టు నిర్మాణం చేపట్టాలని గతంలో అధికారులకు పలుమార్లు విన్నవించాం. ప్రస్తుతం నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ సైతం పూర్తయినా పనులు ప్రారంభం కాకపోవడం శోచనీయం. తక్షణమే నిర్మాణ పనులు చేపట్టాలి.

**– పూజ నరేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు**

### కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చాం



హౌసింగ్ బోర్డ్ కాలనీలో కల్వర్టు నిర్మాణానికి సంబంధించి నిధుల కేటాయింపు, టెండర్ ప్రక్రియ పూర్తయ్యాయి. పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.

**– గోనె లహరి, మున్సిపల్ ఛైర్‌పర్సన్**



## చెత్త బుట్టలను పంపిణీ చేసిన ఎంపీడీవో

**అక్షటుడే, పెద్దకొడప్‌గల్ :** మండలంలోని బురుగుపల్లి గ్రామంలో సర్పంచ్ రామారావు పాటిల్ ఆధ్వర్యంలో ఎంపీడీవో అభినవ్ చందర్ గ్రామస్తులకు చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ కలెక్టర్ ఇటీవల గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి అభినందించారన్నారు. దీంతో జిల్లాలోనే తొలిసారిగా ప్రతి ఇంటికి నాలుగు రంగుల చెత్త బుట్టలను అందజేశామన్నారు. అనంతరం ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



## బారికేడ్లు ఎవరికోసం..?

గతంలో కామారెడ్డి రైల్వే గేటు వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. గేటుపడే సమయంలో ఇష్టానుసారంగా వాహనాలను నిలిపేవారు. దానిని దృష్టిలో ఉంచుకుని వాహనాల నియంత్రణ కోసం అధికారులు మధ్యలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే స్వయం నియంత్రణ లేకపోవడంతో వాహనదారులు బారికేడ్లు ఏర్పాటు చేసినప్పటికీ రెండువైపులా వాహనాలు నిలుపుతున్నారు. దీంతో మళ్లీ రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**– అక్షరటుడే, సురేష్ కామారెడ్డి**

## ఎమ్మార్పీఎస్ కమిటీల రద్దు



**అక్షరటుడే, బోధన్:** ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కమిటీలను రద్దు చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి యాదగిరి ప్రకటించారు. కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవడం కోసం జిల్లాలో ఎమ్మార్పీఎస్ వాటి అనుబంధ సంఘాల కమిటీలను రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వర్గీకరణ విషయంలో 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసి వర్గీకరణ సాధించుకున్నామని ఆయన పేర్కొన్నారు. వర్గీకరణ ఫలాలను మాదిగలకు చేరవేయడంలో నూతన నాయకత్వం అవసరమన్నారు. త్వరలోనే అన్ని కమిటీలను ఎన్నుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు భూమయ్య, అబ్బయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఒక చిన్న తప్పుతో జీవితకాల పొదుపునకు ముప్పు





**అక్షరటుడే, ఆర్మూర్:** ఒక చిన్న నిర్లక్ష్యం వల్ల జీవితకాలం పొదుపు చేసిన సొమ్మంతా తుడిచిపెట్టుకుపోతుందని నిజామాబాద్ అడిషనల్ డీసీపీ శుభం ప్రకాష్ హెచ్చరించారు. బుధవారం ఆర్మూర్ మండలంలోని చేపూర్ క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో 'సైబర్ అవేర్‌నెస్' కార్యక్రమం నిర్వహించారు. సైబర్ భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత అని వివరించారు. ఇక్కడ నేర్చుకున్న విషయాలను ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు అల్జాపూర్ గంగాధర్, అల్జాపూర్ దేవేందర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో దారుణం.. ఆస్పత్రి డ్రైనేజీలో నవజాత శిశువు మృతదేహం




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** జీజీహెచ్‌లో దారుణం చోటు చేసుకుంది. నిత్యం వైద్యుల పర్యవేక్షణ, సెక్యూరిటీ గార్డులు నిఘాలో ఉండే ఆస్పత్రి ప్రాంగణంలోని డ్రైనేజీలో శిశువు మృతదేహం లభ్యమవడం కలకలం రేపింది.. జీజీహెచ్ ఆస్పత్రి కి నిత్యం వేల సంఖ్యలో రోగులు, వారికి సంబంధించిన వారు వస్తూపోతూ ఉంటారు. రోజూ 1500లకు పైగా ఓపీ ఉంటోంది. అలాగే గర్భిణుల కోసం ప్రత్యేక వార్డు ఉంది. నిత్యం సెక్యూరిటీ సిబ్బంది సైతం పర్యవేక్షిస్తుంటారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆస్పత్రిలో డెలివరీ అయిన ఓ నవజాత శిశువు మృతదేహం డ్రైనేజీలో కనిపించడం అందరినీ విస్తుపోయేలా చేసింది. ఆస్పత్రికి వచ్చే ప్రతి గర్భిణి వివరాలు రికార్డుల్లో ఉంటాయి. అలాగే నవజాత శిశువులు జన్మించిన తర్వాత వారి వివరాలు సైతం నమోదు చేస్తారు. అయినప్పటికీ వైద్య సిబ్బందికి, అధికారులకు సమాచారం లేకుండా నవజాత శిశువు మృతదేహం బయటకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. జీజీహెచ్‌లో గతంలో గైనిక్, పిడియాట్రిక్‌కు సంబంధించి విభాగాలు ఉండేవి. అక్కడే డెలివరీలు, పరీక్షలు జరుగుతుండేవి. అయితే బస్టాండ్‌కు ఎదురుగా నిర్మించిన కొత్త భవనానికి ఈ రెండు విభాగాలను మార్చేశారు. సుమారు 12ఏళ్ల వరకు చిన్నారులకు చికిత్సలు, డెలివరీలు, బాలింతలకు సంబంధించిన పరీక్షలన్నీ ఈ కొత్త భవనంలోనే జరుగుతున్నాయి. అయితే డెలివరీ కొత్త భవనంలో జరుగుతుండగా.. జీజీహెచ్ ఆవరణలో నవజాత శిశువు మృతదేహం లభ్యమవడం చర్చనీయాంశమైంది. ఆస్పత్రిలో 60 మంది వరకు సెక్యూరిటీ సిబ్బంది నిత్యం ఆయా విభాగాలను పర్యవేక్షిస్తుంటారు. ఈ సందర్భంగా వన్ టౌన్ పోలీసులు మాట్లాడుతూ.. నవజాత శిశువు మృతదేహం వివరాలు తెలిస్తే 8712659714లో సమాచారం ఇవ్వాలని కోరారు.

## డబుల్ ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలి



**అక్షరటుడే, మెండోరా:** మెండోరాలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను త్వరిత గతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డబుల్ ఇళ్లను వారు పరిశీలించిన అనంతరం మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మాజీ మంత్రి, ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హయాంలోనే మెండోరా మండలంలో పేదల కోసం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పూర్తయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు

## గండిమాసానిపేటలో రోడ్డు పనులు ప్రారంభం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ చొరవతో గండిమాసానిపేట 5వ వార్డులో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రూ.1కోటి వ్యయంతో ఈ రోడ్డును నిర్మించనున్నారు. గండిమాసానిపేటకు తారు రోడ్డు ఉన్నప్పటికీ గుంతల మయంగా మారడంతో ఏళ్లుగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ప్రత్యేక నిధులు తీసుకురావడంతో పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు నిర్మాణం ప్రారంభం కావడంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో గండిమాసానిపేట అభివృద్ధి చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలవనుందని పేర్కొన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో మరొకరి అరెస్ట్ : ఎస్పీ రాజేష్ చంద్ర



**అక్షరటుడే, కామారెడ్డి:** ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠాలోని మరొక సభ్యుడిని కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర బుధవారం వివరాలు వెల్లడించారు. గత నెల 31న కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ మోసం కేసు నమోదైంది. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలించాయి. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా వీడూరుకొండ మండలం వెల్లితుర్తి గ్రామానికి చెందిన ముత్యాల నాయుడు అలియాస్ రుంగాలి ముత్యాల నాయుడును అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు సాట్‌స్పోర్ట్స్ పేర్లతో ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ వెబ్‌సైట్లను నిర్వహిస్తున్నట్లు తేలింది. ప్రజలకు వాట్సాప్ లింకులు పంపి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి యూపీఐ, బ్యాంకు ఖాతాలు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి వద్ద నుంచి ఒక ఐఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మిగిలిన నిందితులు, వారి బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలు, డిజిటల్ పరికరాలపై దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.